నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
15 హైదరాబాద్, బుధవారం 6 మార్చి 2024 RANGAREDDY

## కొత్తూరు కాంగ్రెస్‌లో
# చేరికల లొల్లి


కాంగ్రెస్ కార్యకర్తలను సముదాయిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

- ఇతర పార్టీల నాయకులను చేర్చుకోవద్దంటూ స్థానిక నాయకుల గలాట
- కోపంతో కుర్చీలను విరగ్గొట్టిన నేతలు..
- మండల నాయకులు స్థానిక కేడర్‌ను సంప్రదించకుండానే చేర్చుకుంటున్నారని మండిపాటు
- పదేండ్లు పార్టీకోసం పని చేశామని వ్యాఖ్య
- కార్యకర్తలను సముదాయించి పంపించిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి
- వాయిదా పడిన చేరికల కార్యక్రమం

కొత్తూరు, మార్చి 5 : కొత్తూరు కాంగ్రెస్‌లో చేరికల లొల్లి పతాక స్థాయికి చేరింది. మండల కాంగ్రెస్ నాయకులు తమ ప్రమే యం లేకుండానే కొత్తవారిని చేర్చుకుంటున్నారని.. స్థానిక నాయకులు మంగళవారం గొడవకు దిగారు. ఈ సందర్భంగా ఆగ్రహంతో కుర్చీలను విరగ్గొట్టి నిరసన తెలిపారు.

కొత్తూరు మండల కేంద్రంలోని బావర్చి హోటల్ కింద వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఇతర పార్టీల నాయకులను చేర్చుకునేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ కార్యక్రమం కాసేపట్లో ప్రారంభం కావాల్సి ఉండగా.. ఇన్ముల్‌నర్వకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఖాజాపాషా, రవికుమార్‌గుప్తా అక్కడికొచ్చి గలాటకు దిగారు. తమను సంప్రదించకుండా బీఆర్‌ఎస్ నాయకులను ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. ఎన్నికల్లో తమకు ప్రత్యర్థిగా ఉన్న వారిని చేర్చుకోవద్దంటూ నిరసనకు దిగారు. మాటామాట పెరగడంతో అక్కడ ఉన్న కుర్చీలను విసిరి విరగొట్టారు. మండల నాయకులు కిందిస్థాయి నాయకులను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు. ప్రత్యర్థి వర్గాన్ని పార్టీలో చేర్చుకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తాము పదేండ్లు పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేశామని.. ఇప్పుడు అధికారాన్ని అనుభవించేందుకు ఇతర పార్టీలకు చెందిన నాయకులు వస్తే ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. అక్కడే ఉన్న మాజీ ఎమ్మె ల్యే ప్రతాప్‌రెడ్డి కార్యకర్తలను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. దీంతో చేరికల కార్యక్రమం వాయిదా పడింది.

**హైకమాండ్ ఒకటి తలిస్తే..**

అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ రా ష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే గ్రామాల్లో ఇప్పటికీ బీఆర్‌ఎస్‌కే పట్టు ఉన్నది. ముఖ్యంగా సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు బీఆర్‌ఎస్‌కు చెందిన వారే అధికంగా ఉన్నారు. వారిని కాంగ్రెస్‌లో చేర్పించాలని హైకమాండ్ నుంచి ఆదేశాలు అందాయి. దీంతో మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు మండల నాయకులు ఫోన్ చేసి కాంగ్రెస్‌లో చేరాలని కోరుతున్నారు. అయితే స్థానికంగా ఉన్న నాయకులు మాత్రం వారి చేరికను ఒప్పుకోవడంలేదు. తమను సంప్రదించకుండా ఎవరినీ చేర్చుకోవద్దని షరతులు పెడుతున్నారు. అయితే మంగళవారం జరిగిన గొడవతో కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు జంకుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో వాళ్లలో వా రికే సఖ్యత ఉండదని.. ఒకవేళ తాము ఆ పార్టీలో చేరితే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ తతంగాన్ని ప్రత్యక్షంగా చూసిన ఓ మాజీ సర్పంచ్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడికి ఫోన్ చేసి మీ పార్టీ నాయకులే కుర్చీలతో కొట్టుకుంటున్నారు.. మరి మేం వస్తే పరిస్థితి ఏమిటన్న అని అడగడం కొసమెరుపు.


కాంగ్రెస్ కార్యకర్తల గలాటలో విరిగిపోయిన కుర్చీలు

- ఉచితంగా ఎల్ ఆర్‌ఎస్ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ
- తాజాగా ఎల్ ఆర్‌ఎస్‌కు ఫీజు వసూలు చేయాలని నిర్ణయం
- పేదలకు ఇచ్చిన హామీ అమలుకు బీఆర్‌ఎస్ పోరాటం
- నేడు ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు
- రేపు కలెక్టర్లకు వినతిపత్రం అందజేయనున్న బీఆర్‌ఎస్ నేతలు
- వికారాబాద్ జిల్లాలో పెండింగ్‌లో 11,181 ఎల్ ఆర్‌ఎస్ దరఖాస్తులు
- అత్యధికంగా తాండూరు మున్సిపాలిటీలో 7,834 దరఖాస్తులు
- రంగారెడ్డి జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు 4.50 లక్షలు




# ఎల్‌ఆర్‌ఎస్‌పై..
# బీఆర్‌ఎస్ పోరు..

వికారాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ)/షాబాద్ : ఎల్‌ఆర్‌ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్)ను ఎలాంటి ఫీజు తీసుకోకుండా ఉచితంగా చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఉత్తదేనని తేలిపోయింది. ఎన్నికల ముందు ఆ పార్టీ నేతల మాటలు నమ్మి గెలిపించిన పేద, మధ్యతరగతి ప్రజలను రేవంత్ ప్రభుత్వం దగా చేసింది. ఎన్నికల ముందు ఎవరూ ఎల్‌ఆర్‌ఎస్‌కు ఫీజు చెల్లించొద్దని చెప్పిన కాంగ్రెస్ సర్కారు.. ప్రస్తుతం దానికి సంబంధించిన ఫీజును ఈ నెలాఖరులోగా వసూలు చేయాలని నిర్ణయించింది. ఎల్‌ఆర్‌ఎస్‌పై మాట తప్పిన ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆందోళనలకు సిద్ధమైంది. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గ కేంద్రాల్లో జరుగనున్న నిరసన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, మహే శ్‌రెడ్డిలతోపాటు అధిక సంఖ్యలో బీఆర్‌ఎస్ శ్రేణులు, ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు పాల్గొననున్నారు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లోనూ ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మార్చి 31 వరకు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలని ప్రభుత్వం విధించిన గడువును ఉపసంహరించుకుని ఉచితంగా క్రమబద్ధీకరించాలని .. లేదంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేసేలా పార్టీ అధిష్ఠానం శ్రేణులు దిశానిర్దేశం చేసింది. రేపు కలెక్టర్‌కు వినతిపత్రం అందించాలని బీఆర్‌ఎస్ నేతలు నిర్ణయించారు.

### కాంగ్రెస్ మాట నిలబెట్టుకోవాలి..



ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ముఖ్యనేతలు ఎల్‌ఆర్‌ఎస్‌ను తప్పు పట్టారు. తాము అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజును రద్దు చేస్తామన్నారు. ప్రజల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండానే రెగ్యులరైజ్ చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజల రక్తాన్ని తాగుతున్నారని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క విమర్శలు చేశారు. రిజిస్ట్రేషన్ అయిన స్థలాలకు ఎందుకు డబ్బులు కట్టాలని కూడా అడిగారు. రాష్ట్ర ప్రజల జేబుల నుంచి రూ.20 వేల కోట్లు దోచుకునేందుకు కాంగ్రెస్ సర్కారు ఎల్‌ఆర్‌ఎస్ స్కీంను అమలు చేస్తుంటే డిప్యూటీ సీఎం ఎందుకు మాట్లాడడంలేదు? మార్చి 31 లోగా ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు కట్టాలని దరఖాస్తు దారులకు ఫోన్ కాల్స్ చేయడం.. ప్రజల రక్తాన్ని తాగడంకాదా ..?

**– కే.శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు**

### మాట మార్చడం దుర్మార్గం



కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చాక మాట మార్చడం దుర్మార్గం. పేద, మధ్యతరగతి ప్రజలకు భారం కాకుండా రాష్ట్ర సర్కారే ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ను ఉచితంగా క్రమబద్ధీకరించాలి. గతంలో తాము అధికారంలోకి రాగానే ఉచి తంగా చేస్తామని గొప్పలు చెప్పుకున్న నాయకులు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడంలేదు.

**– తిరుపతిరెడ్డి, కొత్తగడి, వికారాబాద్**



**వికారాబాద్ జిల్లాలో పెండింగ్‌లో 11,181 దరఖాస్తులు..**

వికారాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో 11,181 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో అనుమతిలేకుండా ఏర్పాటు చేసిన లే అవుట్లను రెగ్యులరైజ్ చేయాలని నిర్ణయించింది. అందుకోసం ఆగస్టు 31, 20 20 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలలపాటు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను స్వీకరించింది. అయితే ఓపెన్ ప్లాట్లు, నాన్ లే అవుట్‌కు సంబంధించి దరఖాస్తుదారులు రూ.1000 ఫీజు చెల్లించి డాక్యుమెంట్లను అందజేశారు. పెద్ద లే అవుట్ స్థలానికి సంబంధించి రూ.10 వేలు చెల్లించగా వివిధ కారణాలతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. అయితే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల నుంచి 11,063 దరఖాస్తులు వచ్చాయి. తాండూరు మున్సిపాలిటీ నుంచి 12,138 దరఖాస్తులురాగా 4,300 దరఖాస్తులకు ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తికాగా, మరో 7,834 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్ మున్సిపాలిటీ నుంచి వచ్చిన 3,972 దరఖాస్తుల్లో 54 పెండింగ్‌లో ఉండగా.. పరిగి మున్సిపాలిటీలో 2769 దరఖాస్తులు, కొడంగల్ మున్సిపాలిటీలో 406 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. మరో వైపు గ్రామ పంచాయతీల్లో 118 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.



**రంగారెడ్డి జిల్లాలో 4.50 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో..**

రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు(కల్వకుర్తి), మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలోని 27 మండలాలు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో మొత్తం 4.50 లక్షల ఎల్ ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.



### నమ్మించి మోసం చేయడమే..



ఎల్‌ఆర్‌ఎస్‌ను గతంలో ఉచితంగా చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఫీజు వసూలు చేయాలని నిర్ణయించడం తగదు. అధికారంలో లేనప్పుడు ఓ మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలను మోసం చేయడం తగదు. ఎల్‌ఆర్‌ఎస్‌ను అడ్డుపెట్టుకొని ఫీజులు వసూలు చేయడం సరికాదు.

**– రమేశ్‌బాబు, కొడంగల్ మున్సిపాలిటీ**

### ఉచితంగా క్రమబద్ధీకరించాలి..



ఎన్నికల ముందు చెప్పిన విధంగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలి. ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ. 20 వేల కోట్ల భారం మోపడం ఎంతవరకు సమంజసం. గతంలో ఉన్న ప్రభుత్వాన్ని తప్పుబట్టి ఇప్పుడు మీరు కూడా దోపిడీ చేస్తున్నారా..? 25లక్షల కుటుంబాలపై రూ.20 వేల కోట్ల భారం మోపితే ఊరుకోం. గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌పై కోమటిరెడ్డి వేసిన కేసు ఏమైంది ..? వెంట నే ప్రభుత్వం ప్రజల నుంచి ఎలాంటి ఫీజు తీసుకోకుండా ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించాలి.

**– బుగ్గప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు**

# ‘మన ఊరు–మన బడి’ పనులను పూర్తి చేయండి

**అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశాలు**



వికారాబాద్, మార్చి 5 : జిల్లాలో మన ఊరు–మన బడి కింద చేపట్టిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. మంగళవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో జరుగుతునన మన ఊరు–మనబడి పెండింగ్ పనులను పూర్తి చేయాలని, సీసీ రోడ్ల నిర్మాణ పనులు, పాఠశాలలకు అవసరమయ్యే పనులను పెండింగ్‌లో ఉంచకుండా పూర్తి చేసి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలన్నారు. పాఠశాలల్లో ఇంకా ఏ ఏ పనులు మిగిలి ఉన్నాయో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కింద పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబంధించిన పూర్తి నివేదిక పంపాలన్నారు. ఇంజినీర్లు, డీఈలు నిర్మాణ పనుల్లో జాప్యం చేయకుండా ప్రతి రోజూ జరగాల్సిన పనులకు ఎన్ని మిల్లర్లు, ఎంత మంది లేబర్ అవసరమో తెలుసుకుని పనులను పూర్తి చేయాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ బిల్డింగ్, స్కూల్స్ ప్రహరీ, కిచెన్ షెడ్స్, టాయిలెట్స్, నిర్మాణ పనులు ఏవైతే ముందే ప్రారంభించి పూర్తి కాని పనులను సత్వరమే పూర్తి చేసి, ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని అధికారులకు సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో ఈఈఆర్‌అండ్‌బీ, డీఈవో, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌లు, డీఈలు, అధికారులు పాల్గొన్నారు.


లాల్‌సింగ్‌తండాలో కాలిపోయిన హరితహారం మొక్కలు

# కొరవడిన పర్యవేక్షణ

**హరితహారం మొక్కలు అగ్నికి ఆహుతి**

వికారాబాద్, మార్చి 5 : అధికారుల నిర్లక్ష్యం.. పర్యవేక్షణ కొరవడడంతో హరితహారం మొక్కలు ఎండిపోతున్నాయి. మండుతున్న ఎండలకు నీరందక మాడిపోతున్నాయి. కొటాలగూడ అనుబంధ గ్రామం లాల్‌సింగ్‌తండాలోని క్రీడాప్రాంగణం సమీపంలో నాటిన మొక్కలకు గుర్తు తెలియని వ్యక్తులు అగ్గి పెట్టడంతో కాలిపోయాయి. వాటికి ట్రీ గార్డులతోపాటు ఎలాంటి రక్షణ చర్యలను అధికారులు తీసుకోలేదు. ఈ ఘటన జరిగి పది రోజులు గడిచినా వాటి స్థానంలో కొత్త మొక్కలనూ నాటలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలిపోయిన మొక్కల స్థానంలో కొత్త వాటిని నాటడంతోపాటు ఉన్న మొక్కలు ఎండిపోకుండా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.

# జీతాలెప్పుడొస్తయో ?

- మూడు నెలలుగా అందని వేతనాలు
- ఆర్థిక ఇబ్బందులతో సతమతం
- జిల్లా వ్యాప్తంగా 178 మంది ఉపాధి హామీ ఉద్యోగులు, సిబ్బంది

రంగారెడ్డి, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి స్థానికంగా ఉపాధి కల్పించే ఉపాధి హామీ పథకంలో భాగస్వాములవుతున్న వారికే బతుకు దెరువు ప్రశ్నార్థకంగా మారింది. మూడు నెలలుగా వేతనాలు అందక ఆయా ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. బడ్జెట్ కేటాయింపులు లేకనే వేతనాలు నిలిచిపోయినట్లు తెలుస్తున్నది.

**రోజంతా శ్రమిస్తున్నా..**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సహాయ ప్రాజెక్టు అధికారులు, ఇంజినీర్లు, ప్లాంటేషన్ మేనేజర్, ప్లాంటేషన్ సూపర్ వైజర్, జిల్లా అదనపు రిసోర్స్‌పర్సన్, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, క్షేత్ర సహాయకులు, పొరుగు సేవల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఏడాదికి సరిపడా ప్రణాళికలు సిద్ధం చేసి లక్ష్యం చేరేలా కూలీలకు పనులు కల్పించడం, కొలతలు తీయడం, పరిశీలించడంతోపాటు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చడం, హరితహారం వంటి పనులతో తీరిక లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి వేతనాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నది. ఉద్యోగుల జీతాలు, కార్యాలయాల అవసరాల నిమిత్తం కేంద్రం బడ్జెట్ కేటాయిస్తుండగా.. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తున్నది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రతి నెలా క్రమం తప్పకుండా వేతనాలు వచ్చేవి. 10వ తేదీలోపే ఉద్యోగుల ఖాతాల్లో జమ అయ్యేవి. కానీ.. గత మూడు మాసాల నుంచి వీరి వేతనాలకు బ్రేక్ పడింది.

**ఇబ్బందుల్లో 178 మంది ఉద్యోగులు..**

రంగారెడ్డి జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న వివిధ విభాగాలకు సంబంధించి 178 మంది ఉన్నారు. గత ఏడాది డిసెంబర్ మాసం నుంచి ఇప్పటి వరకు వీరికి వేతనాలు అందలేదు. రాష్ట్ర శాఖలో బడ్జెట్ లేకపోవడం వల్లనే వేతనాలు పెండింగ్‌లో ఉంటున్నాయని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఇంటి అద్దె, ఈఎంఐలు, ఇతర కుటుంబ అవసరాలకు ఇబ్బందులు తప్పడం లేదని ఉద్యోగులు, సిబ్బంది వాపోతున్నారు. అప్పులు జేసి అవసరాలు తీర్చుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయి వేతనాలను విడుదల చేయాలని కోరుతున్నారు.

